ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పార్క్ ఎడిషన్
EVENING 6 PM
సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 349 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 1 + https:www.prajarepublic.com + వెల - 1/-
శనివారం 16 జూలై 2025
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole






# రాజస్థాని మహిళ మండలి ఆధ్వర్యంలో శివ మహాపురాణం

## ఆకర్షింప చేసిన మదన్ మోహన్ స్వామీజీ ప్రవచనాలు

## శోభాయామానంగా స్వామి రథయాత్ర

**తాండూరు, జూలై 19, (రిపబ్లిక్ న్యూస్):** తాండూరు రాజస్థాని మహిళ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన శివ మహాపురాణం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం రాజస్థాని మహిళ మండలి ఆధ్వర్యంలో వారి ఆచారం ప్రకారం శ్రావణమాసంను పురస్కరించుకుని 5 రోజుల పాటు శివ మహాపురాణం ఆధ్యాత్మిక కార్యక్రమాలను పట్టణంలోని గగ్రానీ గార్డెన్ లో ఏర్పాటు చేశారు.





మొదటి రోజు జైపూర్ నుంచి ప్రముఖ పండితులు మదన్ మోహన్ స్వామిజీ రావడం తో ఆయనను ప్రత్యేక శోభాయాత్రగా కళాశాలతో స్వాగతం పలికారు. బాలాజీ మందిర్ నుంచి గగ్రాని గార్డెన్ వరకు ఈ శోభాయాత్రను నిర్వహించారు. అనంతరం గగ్రాని గార్డెన్లో శివ మహాపురాణాన్ని మదన్మోహన్ స్వామిజీ ప్రారంభించి ప్రవచనాలను వినిపించారు. ఈ ప్రవచనాలకు మహిళలు, భక్తులు ఆసక్తిగా విన్నారు. శివునికి మహిమలను కూడా వినిపించారు. ఇలా ఐదు రోజులపాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళ మండలి అధ్యక్షురాలు కిరణ్ మన్మోహన్ సార్డా, కార్యదర్శి వర్షా కైలాస్ సార్డా, కోశాధికారి కల్పన ఆనంద్ రాఠీ, కార్యక్రమ ఆర్థిక సహాయకులు, ముఖ్య నిర్వహకులు రాంబగస్ బంకట్ లాల్ సోని, మురలీధర్ గగ్రాని, రాజేష్ సోని కుటుంబ సభ్యులు, సమాజం పెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.





## జగన్ లూటీ చేసిన ప్రజాధనాన్ని కక్కిస్తాం:మంత్రి నిమ్మల

**చోడవరం, జూలై 19, (రిపబ్లిక్ న్యూస్):** అనకాపల్లి జిల్లా చోడవరం నియోజకవర్గంలో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ, ఎమ్మెల్సీ చిరంజీవిరావుతో కలిసి సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు పాల్గొన్నారు.



చోడవరం గ్రామంలో గడప గడపకు తిరుగుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. "రాష్ట్రంలో ఐదేళ్లలో ఇచ్చే పింఛన్లతో ఐదు పోలవరం ప్రాజెక్టులు కట్టవచ్చు. గత వైకాపా ప్రభుత్వం మూడు రాజధానులు అని చెప్పి.. ఒక్క రాజధానికి కూడా ఇటుక ముక్క పేర్చలేదు. జగన్ హయాంలో రాష్ట్రానికి వచ్చిన పరిశ్రమలన్నీ తరిమేశారు. గత ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలను సరిచేస్తూ.. చంద్రబాబు పాలనను గాడిలో పెడుతున్నారు. గత ఐదేళ్లలో ఇసుక, భూములు, గనులు, లిక్కర్ను లూటీ చేశారు. జగన్ లూటీ చేసిన ప్రజాధనాన్ని కక్కిస్తాం" అని మంత్రి అన్నారు.

## సిట్ విచారణకు హాజరైన వైకాపా ఎంపీ మిథున్ రెడ్డి

**విజయవాడ, జూలై 19, (రిపబ్లిక్ న్యూస్):** ఏపీ మద్యం కుంభకోణం కేసులో భాగంగా వైకాపా ఎంపీ మిథున్రెడ్డి విజయవాడలో సిట్ ఎదుట విచారణకు హాజరయ్యారు. ఆయన ఈ కేసులో ఏ4గా ఉన్నారు. ఇప్పటికే మిథున్రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్ ను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. శుక్రవారం సుప్రీంకోర్టు కూడా ఆయన పిటిషన్ ను తోసిపుచ్చింది. మిథున్రెడ్డి రాక నేపథ్యంలో సిట్ కార్యాలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వాహనాల రాకపోకలను పోలీసులు నియంత్రిస్తున్నారు. మిథున్ రెడ్డి ఏ క్షణమైనా అరెస్టయ్యే అవకాశం కనిపిస్తోంది. హైకోర్టు, సుప్రీంకోర్టు ముందస్తు బెయిల్ పిటిషన్లను కొట్టేయడంతో ఆయనపై అరెస్టు వారంట్ జారీ కోసం సిట్ అధికారులు శుక్రవారం విజయవాడ ఏసీబీ కోర్టులో మెమో వేశారు. అయితే హైకోర్టు, సుప్రీంకోర్టు ఆదేశాలకు సంబంధించి పూర్తి వివరాల్ని దానికి అనుబంధంగా సమర్పించాలని ఆదేశిస్తూ న్యాయాధికారి ఆ మెమో రిటర్న్ చేయటంతో.. వాటిని ఆగమేఘాలపై సమర్పించారు.



## ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని పరిశీలించిన చంద్రబాబు

**తిరుపతి, జూలై 19, (రిపబ్లిక్ న్యూస్):** ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుపతిలో పర్యటించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా.. రేణిగుంట మండలం తూకివాకం వద్ద ఇంటిగ్రేటెడ్ వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్ను చంద్రబాబు పరిశీలించారు. ట్రీట్ చేసిన నీటిని ఎలా సద్వినియోగం చేస్తున్నారని అధికారులను అడిగారు.

రీసైకిలింగ్ కోసం వచ్చిన ఘన వ్యర్థాలను వినియోగించుకున్న తర్వాత వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లకు తరలించాలని సూచించారు. తిరుపతి సహా 40 నుంచి 50 కిలోమీటర్ల పరిధిలో సేకరించిన వ్యర్థాలను వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లు సద్వినియోగం చేసుకునేలా చూడాలని స్పష్టం చేశారు. విశాఖ సహా పరిసర ప్రాంతాల్లోనూ ఇదే తరహాలో వ్యర్థాలను సద్వినియోగం చేసేలా చూడాలని పేర్కొన్నారు. వ్యర్థాల నిర్వహణలో దేశానికి రోల్ మోడల్గా ఏపీ నిలిచేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.



## దౌత్య విభేదాల తర్వాత.. తొలిసారి మాల్దీవులకు ప్రధాని మోదీ

**జూలై 19, (రిపబ్లిక్ న్యూస్):** ప్రధాని నరేంద్ర మోదీ వచ్చే వారంలో విదేశీ పర్యటనకు వెళ్లనున్నట్లు అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. జులై 23 నుంచి 26 వరకు యూకే, మాల్దీవుల్లో పర్యటించనున్నట్లు తెలుస్తోంది. గతేడాది మోదీపై, లక్షద్వీప్పై మాల్దీవుల మంత్రులు చేసిన వివాదాస్పద వ్యాఖ్యలతో రెండు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు నెలకొన్న విషయం తెలిసిందే. విభేదాల అనంతరం ప్రధాని ఆ దేశానికి వెళ్లడం ఇదే మొదటిసారి కావడంతో ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.



మాల్దీవులతో బలమైన దౌత్య సంబంధాలు, పరస్పర ప్రయోజనాలు పునరుద్ధరించడానికి ఈ పర్యటన సహకరిస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తంచేశారు. జులై 23-24 తేదీలలో మొదట యూకేలో జరగనున్న భారత్-బ్రిటన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం పై జరిగే చర్చల్లో మోదీ పాల్గొని.. ఒప్పందంపై సంతకం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. యూకే ప్రభుత్వంతో దౌత్య, వాణిజ్య చర్చలు జరపనున్నారు. అనంతరం జులై 25-26 తేదీలలో ప్రధాని మాల్దీవులకు వెళ్లనున్నారు. మాల్దీవుల 60వ జాతీయ దినోత్సవానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరవుతారు. గతేడాది జనవరిలో లక్షద్వీప్ను సందర్శించిన ప్రధాని నరేంద్ర మోదీ.. సాహసాలు చేయాలనుకున్నవారు ఇక్కడికి రావాలని పిలుపునిచ్చారు. దీనిపై మాల్దీవుల మంత్రులు అక్కసు వెళ్లగక్కారు. ఇది ఇరుదేశాల మధ్య దౌత్యపరమైన సంబంధాలను దెబ్బతీసే స్థాయికి చేరింది. అనేకమంది భారతీయులు.. ఆ దేశ టూర్ ప్లానన్ను విరమించుకున్నారు. సోషల్ మీడియాలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. బాయ్కట్ మాల్దీవ్స్ పేరిట హ్యాష్యాగ్ ట్రెండ్ అయింది. ఆ వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టిన మాల్దీవులు.. ఆ వ్యాఖ్యలతో తమ ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని తెలిపింది. అనంతరం ఆ మంత్రుల పైనా వేటు వేసింది. ఆ తర్వాత నుంచి అధ్యక్షుడు ముయిజ్జు తీసుకున్న భారత వ్యతిరేక నిర్ణయాలు కూడా ఇరుదేశాల మధ్య దూరాన్ని పెంచాయి.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com